# పోతపోటు

- పొదిల శ్రీరామమూర్తి




ఆంధ్రదేశంలో అదొక ఆఫీసు. అక్కడ పనిచేసే గుమాస్తాల చేతుల్లో తిరుగాడే ఫైళ్ళు దేశంలోని ప్రజల జీవనానికి అతి ముఖ్యమైనవి. అందువల్ల ఆ కార్యాలయాని కొచ్చే వాళ్ళ సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఆ వచ్చేవాళ్ళకు ఆ యా గుమాస్తాలతో అవసరా లుంటాయి. ఆ అవసరాల పునాదిమీద ఆ యా గుమాస్తాలు ఇళ్ళు కట్టుకొంటారు. ఆ ఇళ్ళకూ, ఆ ఇళ్ళల్లోని అట్టహాసాలకూ కారణం ప్రజల చలవే. వాళ్ళ చలవ మూలంగానే ఆ గుమాస్తాల ఇళ్ళన్నీ ఏ.సీ.లు లేకుండానే చల్లగా ఉన్నాయి. నాట్లు వేయకుండానే పచ్చ పచ్చగా ఉన్నాయి. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయి కొన్ని నెలలు జీతా లివ్వకపోయినా వాళ్ళ బతుకు పచ్చగానే ఉంటుంది-వానలు కురవకపోయినా పచ్చగా కనిపించే పచ్చిక బయళ్ళలాగా.

ఈ కాలంలో కొంతమందితో మనకు అవసరం రాకూడదు. ఒక్కసారి ఆ అవసరం వచ్చిం దంటే జీవిత మంతా అది కొనసాగుతూనే ఉంటుంది. ఉదాహరణకు మనిషికి డాక్టరు అవసరం రాకూడదు. ఒక్కసారి అవసరం తగిలిందో జీవితాంతం వారికి ఫీజులు చెల్లించుకోవాల్సిందే. వారి దర్శనం చేసుకోవాల్సిందే. అలాగే మన గడియారాలు, టీవీ.లు, రేడియోలు, టేప్‌రికార్డర్లు-ఒక్కసారి బాగుచేసే వాడి దగ్గర కెళ్ళడం మొద లయితే చాలు, ఇక అవి ఆ యా షాపుల చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సిందే. అందుకనే అలాంటి అవసరాలు తగలకూడదని నే నెప్పుడూ కోరుకుంటూంటాను. ఆంధ్రదేశంలోని పై ఆఫీసుకు వెళ్ళాల్సిన అవసరం నాకు జీవితంలో ఎప్పుడూ రాకూడదని కోరుకుంటాను. అయితే మనం అనుకొన్నవి అనుకొన్నట్లుగా ఎప్పుడూ జరగవు. రెండేళ్ళ కిందట ఆ ఆఫీసులో అతి ముఖ్యమైన అవసరం కలగటంతో ఆ రోజు ఆ కార్యాలయానికి బయలుదేరి వెళ్ళాను.

గేట్లో జవా న్నడిగి నా క్కావలసిన ఫైలును నడిపే చేదకుడి వివరాలు సేకరించాను. ఆ గుమాస్తా వైపు అడుగు వేయబోయేసరికి ఆ జవాను చెయ్యి చాపి "కాఫీకి" అన్నాడు.

నాకు అర్థమయింది. అయితే ఉద్యోగం చేసుకొంటూ ఇలా అడుక్కునే వాళ్ళంటే నాకు చాలా అసహ్యం. అలాగే అసహ్యంగా, చీదరింపుగా అతని వైపు చూసి 'నేను ఏమీ ఇచ్చేవాడిని కా'నన్నట్లు సైగ చేసి గుమాస్తాను చేరాను.

అతను నన్ను చాలా ఆప్యాయంగా ఆహ్వానించి కుర్చీ చూపించి, "చెప్పండి మీ కేం కావాలి" అని అడిగాడు.

నా క్కావలసిన పని గురించి వివరంగా చెప్పాను.

"అర్జంటా అండీ?"

"అందుకే వచ్చా."

"అయితే ఓ ఏభయి ఇచ్చుకోండి."

"ఏభయ్యా... ఎందుకూ?"

"మే పని అర్జెంటుగా చేసి పెట్టినందుకు."

"నా పని చేసిపెట్టడం మీ ఉద్యోగ ధర్మం. ఇలా లంచాలు అడగటం అధర్మం."

"ఇవన్నీ అనవసరం మాస్టారూ. నే నడిగింది ఇవ్వండి. సాయంకాలాని కల్లా మీ క్కావలసిన కాగితం తీసుకొని పొండి... లేదా "

"ఊ... లేదా?" అని గర్జించాను కోపంగా.

"మీ రిలా కోపంగా గర్జించటంవల్ల మీకే నష్టం. వెళ్ళి రండి"

ఆ ఆఫీసు సంగతి నాకు ఎప్పటినుండో తెలుసు. అందుకే నాకు ఎంతో అవసరం ఉన్నా ఆ ఆఫీసు గుమ్మంలో ఇంతవరకూ అడుగు పెట్టలేదు. కానీ ఇవ్వాళ తప్పలేదు. ఈ ఆఫీసులో విచ్చలవిడిగా నగ్న నృత్యం చేస్తున్న ఈ లంచాల అవినీతిని ఎలా అరికట్టాలి? నా లాంటి వాళ్ళ మొర వినే దెవడు?


మరునాడు నా అనుభవాన్ని రాసి ఒక దినపత్రికకు పంపాను. ఆ మరునాటి నుంచీ ఆ ఆఫీసు గుమాస్తా బాధితులు తమ తమ ఇబ్బందుల్నీ అనుభవాల్నీ రాయడంతో ఆ ఆఫీసు అందరి దృష్టిలో పడింది. అయితే

దానివల్ల సమస్య పరిష్కారం కాలేదు; పత్రికలు ఎక్కువగా అమ్ముడుపోయాయి తప్ప.

అయితే ఈ లేఖల దుమారం మూలంగా ప్రభుత్వ పాలకుల దృష్టిలోకి కూడా ఆ ఆఫీసు కథ జొరబడటం జరిగింది. దాంతో అవినీతి శాఖవాళ్ళు ఆ ఆఫీసులోని గుమాస్తాల దుమ్ము దులిపే ప్రయత్నాలు చాలాసార్లు జరిపారు. దానివల్ల కొందరి దుమ్ము వదిలింది కూడా.

ఈ మధ్య కాలంలో-"అవినీతిని నిర్మూలిస్తాను. లంచగొండులను అరికట్తాను. పేద ప్రజలకు చేదోడుగా నిలబడ్తాను"-ఇలాంటి నినాదాలు రాజకీయ నాయకుల ఉపన్యాస విన్యాసాల్లో తొంగిచూడటం మొదలుపెట్టాయి. అయితే ఈ నినాదాల ముసుగులో వాళ్ళూ లంచగొండులుగా తయారైపోయారనే వివాదం కూడా ఉంది. అవినీతి, లంచం అనేవి నిర్మూలింపలేని విశ్వమంత నిండిన సూత్రలని చాలా మంది పెద్దలు సెలవిచ్చారు కూడా. విశ్వమంత నిండి ఉన్నా నా వంటి కొందరు ఆ రెండు సూత్రలకూ దూరంగా ఉంటూ, వారిని ఎదుర్కొంటూ నిరంతరం పోరాటం సాగించేవాళ్ళూ ఉన్నారు. ఇలాంటివి అలా కలకాలం కొనసాగుతూనే ఉంటాయేమో ననిపిస్తూంటుంది.

మొత్తానికి నా లేఖకు స్పందించిన జనం ప్రభుత్వ యంత్రాంగాన్ని నిద్ర లేపటం నాకు ఉత్సాహాన్నిచ్చింది. ప్రభుత్వం నిద్ర లేవడం ఆశ్చర్యపడాల్సిన సంగతే. దాని పర్యవసానం ఇలాంటి కొన్ని కొన్ని కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖవాళ్ళు ప్రత్యేకంగా ఒక ఆఫీసర్ని నియమించటం. దాని మూలంగా అందరి సమస్యలు అక్కడి కక్కడే తేలిపోవడానికి అవకాశం కల్పించటం జరిగిందని విన్నాను. ఈ మార్పు సంతోషించదగ్గదే. ఈ మొత్తం మార్పుకు నా చిన్న లేఖ కారణం అవటం కూడా నాకు సంతోషించ తగ్గ విషయమే.



ఫోటో: జి. వెంకటేశ్వరావు

ఇప్పుడు మళ్ళీ అదే ఆఫీసుకు వెళ్ళాల్సి వచ్చింది నాకు. అయితే ఈసారి లంచాల బెడద లేని ఆఫీసులోకి వెళ్తున్నా ననే విషయం గురించి మరీ మరీ ఆలోచిస్తూ వెళ్ళాను.

నా క్కావాల్సిన గుమాస్తా వివరం నాకు తెలిసినా కావాలని ప్యూన్‌ను పిలిచి అడిగాను. అతను ఎంతో గౌరవంగా నన్ను నా క్కావాల్సిన గుమాస్తా దగ్గరకు తీసుకెళ్ళాడు. అతను కాఫీ డబ్బులకు చేయి చాపకపోవడంతో నేను తృప్తిగా గాలి పీల్చుకొని కుర్చీలో కూర్చున్నాను గుమాస్తా కెదురుగుండా. నా క్కావాల్సిన పని వివరాలు గుమస్తాకు చెప్పాను.

నా క్కావలసిన ఫైలును వెంటనే తెప్పించి చూడటం మొదలుపెట్టాడు. ఫైలు చూస్తూ ఎడమచేతి నా వైపుకు చాపి చూపుడువేలునూ, బొటనవేలునూ కలిపి చిటికెలు వెయ్యడం మొదలెట్టాడు.

పూర్వకాలం భాష ప్రచారంలో లేని కాలంలో సంజ్ఞల ద్వారా తమ తమ అభిప్రాయాలను తెలియచెప్పుకుంటూండే వాళ్ళట. ఇప్పుడు భాషలు బహుళ ప్రచారంలోకి వచ్చిన ఈ నాగరికులు సంజ్ఞలలోకి దిగారు. మొత్తానికి సంజ్ఞలతో తనకు వంద రూపాయలు కావాలనే విషయాన్ని నాకు ఎరుకపరచాడు. అయితే పరిస్థితి మారలేదన్నమాట.

వెంటనే నేను అక్కడి నుండి లేచి ప్రత్యేకం నియమించబడ్డ ఆఫీసరును కలిశాను. నా ఇబ్బందిని వివరంగా చెప్పాను.

"అయితే ఏమంటారు? అతను వంద రూపాయలు అడుగుతున్నాడు. నే నెందుకు ఇవ్వాలీ అంటారు అంతేగా? పని మీ అవసరం. డబ్బు ఆయన అవసరం. మీ కీ పని వెంటనే కావాలంటే ఈ టేబులు మీద కూడా ఓ ఏభై ఉంచి ఆయనకు ఓ వంద ఇవ్వండి. వెళ్ళిరండి" అన్నాడు.

నేను షాక్ తిన్నాను.

యుద్ధాల మూలంగా శత్రు నాశనంతో పాటు కొత్త శత్రువులు పెరుగుతారని పుస్తకాల్లో చదివింది నా అనుభవంలోకి వచ్చింది. ఆ రోజు నే నా లేఖ రాయకుండా ఉన్నా బాగుండి ఉండే దేమో అనిపించింది. అప్పుడు ఇలాంటి ఆఫీసర్లు నియమితు లయ్యేవాళ్ళు కారు. మామూలుగా ఒక వందతో అయిపోయే పనికి ఇప్పుడు అదనంగా మరో ఏభై రూపాయలు జోడింపు జరిగితే తప్ప పనులు జరగని పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు భారం తగ్గాల్సింది పోయి పెరిగింది.

నేను పొరపాటు చేశానా లేఖ రాసి?

నా కేం అర్థం కావటంలేదు-మీరే చెప్పండి. ★

